www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

# సూర్యుడే సంపద..




**ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహన**

**తాడిపత్రి,జూన్16.అక్షర టైమ్స్:** సూర్యుడే సంపద అని ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం మున్సిపల్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తూ అధికారులు ఈ విధంగా మాట్లాడారు. ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి గరిష్టంగా రూ.78 వేల వరకు సబ్సిడీ అందజేస్తోందని వివరించారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా ప్రతి నెల విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి, సామాన్య కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని వివరించారు. పథకానికి అర్హులైన వారు అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హతలు, సబ్సిడీ వివరాలపై సందేహాలు ఉంటే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఏక్నాథ్, ఎలక్ట్రికల్ ఏఈ రాజారావు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రీన్ గ్రిడ్ సోలార్ యాజమాన్యం మల్లికార్జున ప్రతినిధులు పాల్గొని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ పథకం ప్రయోజనాలను వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ఆసక్తి కనబరిచారు.

# ఏఐ తో పోటీ పడాలంటే క్రమ-శిక్షణే ఆయుధం

**- ఈ మహిళల విజయగాథలే ఆదర్శం**

**- జేసీ ప్రభాకర్ రెడ్డి**




**తాడిపత్రి,జూన్16.అక్షర టైమ్స్:** నేటి పోటీ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ)ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దానితో పోటీ పడి జీవితంలో విజయాలు సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై ప్రకాశం హైస్కూల్ విద్యార్థుల కోసం బుధవారం అవగాహన, ప్రేరణాత్మక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న నలుగురు వివాహిత మహిళలను ఉదాహరణగా ప్రస్తావించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమకు తామే అవకాశాలు సృష్టించుకుని వ్యాపార వర్గాలు రంగంలో విజయాలు సాధించారని చెప్పారు. వారిలో అనిత అనే మహిళ బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి ప్రస్తుతం మిక్స్‌డ్ ఫ్రూట్స్ వ్యాపారం నిర్వహిస్తూ నెలకు సుమారు రూ.45 వేల ఆదాయం పొందుతున్నారని తెలిపారు. అలాగే మరో మహిళ "తాడిపత్రి ఈవెంట్స్" పేరుతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగంలో, ఇంకొకరు ఫ్యాన్సీ డ్రెస్ వ్యాపారంలో రాణిస్తూ లక్షల రూపాయల ఆదాయం సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగి విజయాలను అందుకున్నారని చెప్పారు. ఏ ఐ ఎంత శక్తివంతమైనదైనా, మానవుల ఆలోచనా శక్తి, సృజనాత్మకత, కష్టపడి పనిచేసే తత్వానికి ప్రత్యామ్నాయం కాదని అన్నారు.ఈ మహిళల విజయ గాథలే అందుకు ప్రత్యక్ష ఉదాహరణలని వివరించారు. విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా కొత్త అవకాశాలను గుర్తించి, నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విజయవంతమైన మహిళలు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారికి మార్గనిర్దేశం చేయనున్నారని తెలిపారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని జేసీ ప్రభాకర్ రెడ్డి వివరించారు. బుధవారం ప్రకాశం హైస్కూల్ లో నిర్వహించే మోటివేషన్ కార్యక్రమానికి పాత్రికేయులు సైతం రావాలని ఆహ్వానించారు.

# మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుంది

**- పుట్టపర్తిలో జరిగిన సుపరిపాలన దిగ్విజయ సభలో పరిటాల శ్రీరామ్**

**- శ్రీరామ్ ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన**

**- కూటమికి పునాది వేసింది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణే**

**- జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపు**





**ధర్మవరం,జూన్15.అక్షర టైమ్స్:** రాష్ట్రంలో మరో 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని.. దీన్ని ఎవరు ఆపలేరని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో రెండేళ్ల కూటమి ప్రభుత్వ సుపరిపాలన దిగ్విజయ సభలో ఆయన పాల్గొన్నారు. సభకు వచ్చిన కార్యకర్తలను, ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ విప్లవానికి నాంది పలికింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ఆ తర్వాత దాన్ని కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు అభివృద్ధి జరిగినా అది ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండగా మాత్రమే సాధ్యమైందన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పై ప్రజలు ఎంత ఆగ్రహంగా ఉన్నారో రెండేళ్ల క్రితం అంతా చూసామన్నారు. అయితే కూటమి విజయానికి కేవలం వైసీపీపై ఉన్న కోపం మాత్రమే కాదని.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎన్డీఏ పై విశ్వాసంతోనే ప్రజలు ఇలాంటి తీర్పునిచ్చారన్నారు. దానిని ఏమాత్రం వమ్ము చేయకుండా అధికారంలోకి వచ్చినప్పటి నుంచే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం వైపు అడుగులు వేశారన్నారు. ఓవైపు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టారన్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తున్నారన్నారు. ఇందులో మంత్రి నారా లోకేష్ కృషి కూడా ఎంతో ఉందని శ్రీరామ్ అన్నారు. రెండేళ్ల పాలనలో ఏం జరిగిందన్నది ప్రజలంతా చర్చించుకుంటున్నారని ఇది కూటమి సాధించిన మరో విజయం అన్నారు. ఆరోజు కూటమికి పునాది వేసింది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆయన తీసుకున్న నిర్ణయమే కూటమిగా ఏర్పడి ప్రజల విశ్వాసాన్ని పొందామని శ్రీరామ్ అన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. వీటన్నిటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మన పార్టీ శ్రేణులపై ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆశీర్వాదంతో మరో 15 ఏళ్లపాటు ఏపీలో కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు - విద్యాసంస్థల బస్సులపై కఠిన తనిఖీలు చేపట్టాలి

**- ఆర్టీఓ కు వినతిపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర**



**కదిరి,జూన్16.అక్షర టైమ్స్:** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సుల భద్రతా ప్రమాణాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని కోరుతూ కదిరి ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్టీఓ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషం మహేంద్ర మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ పరిధిలో అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులు విద్యార్థులను తరలిస్తున్నాయని, అయితే వాటిలో కొన్ని బస్సులు నిబంధనలకు అనుగుణంగా నడుస్తున్నాయా లేదా అన్నదానిపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రతి విద్యాసంస్థ బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్, జిపిఎస్ పరికరాలు, స్పీడ్ గవర్నర్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్విప్‌మెంట్, అత్యవసర ద్వారం వంటి భద్రతా సదుపాయాలు ఉన్నాయా లేదా అనే అంశంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే బస్సు డ్రైవర్లు, సిబ్బంది అర్హతలు, డ్రైవింగ్ లైసెన్సులు, పోలీస్ వెరిఫికేషన్ వివరాలను పరిశీలించాలని అన్నారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత విద్యాసంస్థలతో పాటు రవాణా శాఖ అధికారులపై కూడా ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్టీఓ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కదిరి నియోజకవర్గ నాయకులు సిద్ధార్థ, జగన్మోహన్, సాయి ప్రదీప్, త్రిలోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమాస్పద వ్యక్తుల పట్ల జాగ్రత్త




**తాడిమర్రి,జూన్16.అక్షర టైమ్స్:** తాడిమర్రి ప్రాంతంలో ఇటీవల జరుగుతున్న దొంగతనాల నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండగలరని ఎస్ ఐ. కృష్ణ వేణి తెలిపారు, గ్రామంలో లేదా పరిసర ప్రాంతాల్లో బైక్‌లపై తిరుగుతూ అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులు, తెలియని వ్యక్తులు లేదా ఏదైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే క్రింది నంబర్లకు సమాచారం అందించగలరన్నారు, అత్యవసర సేవలు: 100 / 112 ఎస్.ఐ., తాడిమర్రి:9440901893 కి ఫోన్ చేయాలన్నారు, మీరు అందించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుంది. ప్రజల సహకారంతో నేరాలను నివారించి శాంతిభద్రతలను కాపాడుకుందామన్నారు

# పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి -- సిపిఎం

**- ప్రజలపై భారాన్ని తగ్గించాలి**

**- సిపిఎం శాఖ సమావేశంలో డిమాండ్**



**ముదిగుబ్బ,జూన్16.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ మండల కేంద్రంలో సిపిఎం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదలపై నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలను తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలు అధికమవుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. వంట గ్యాస్ ధరలు కూడా సామాన్య కుటుంబాలకు భారంగా మారాయని, వెంటనే ధరలను తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ముదిగుబ్బలోని హిందూ స్మశాన వాటిక నిర్వహణపై కూడా సమావేశంలో చర్చించారు. స్మశాన వాటిక నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమావేశం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు కార్యదర్శి బాబ్జాన్, కో-కన్వీనర్ టైలర్ ముస్తఫా, పకీరప్ప, ముజఫర్, ఫక్రుద్దీన్, రిక్షా ముస్తఫా, రఫీ, అల్లాబక్ష్ తదితర నాయకులు పాల్గొని వివిధ ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి శివ



**రాయదుర్గం,జూన్16.అక్షర టైమ్స్:** రాయదుర్గం పట్టణంలో స్పెషల్ ఇంటెన్సివ్ రి విజన్( ఎస్ఐ ఆర్) పై రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి పో రాళ్ళ శివ ఆధ్వర్యంలో 2వ వార్డ్ లో ఇంటింటికి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బి ఎల్ ఓ వారి ద్వారా మీ కుటుంబంలో తొలగించిన ఓటర్లను మరియు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటు నమోదు చేయించాలి. బి ఎల్ ఎ పార్టీ విభాగం గిరిజాపతి వైయస్సార్సీపి సో సోము, రవికుమార్, వ గ్గ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి



**పెద్దవడుగూరు,జూన్16.అక్షర టైమ్స్:** పెద్దవడుగూరు మండలంలోని ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ షాషావలిసూచించారు మంగళవారం ఆయన పెద్దవడుగూరులో పర్యటించి, లబ్ధిదారుల వివరాలు, లేఅవుట్‌లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. లేఅవుట్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు సెప్టెంబర్ 30 లో వెంటనే పూర్తి చేయాలని, అంత లోపు ఇల్ల నిర్మాణం పూర్తి చేస్తే బిల్లులు మంజూరు చేస్తామని డీఈ షాషావలి హామీ ఇచ్చారు ఆయన వెంట హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్య ఉన్నారు.

# ద్విచక్ర వాహనాల వేలం 25000 ఆదాయం



**పెద్దవడుగూరు,జూన్16.అక్షర టైమ్స్:** పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన పలు ద్విచక్రవాహనాలకు మంగళవారం స్టేషన్ ఆవరణలో పోలీసులు వేలంపాట నిర్వహించారు. మండల తహసీల్దార్ ఉషారాణి సమక్షంలో ఎస్సై ఆంజనేయులు పోలీసు సిబ్బంది పాల్గొని బాగా తుప్పు పట్టిన ఏడు ద్విచక్ర వాహనాలకు వేలంపాటను చేపట్టారు. అన్ని వాహనాలను తెలికి గ్రామానికి చెందిన బాషా పాడి దక్కించుకున్నారు. వేలంపాటలో సుమారు పదిమంది పాల్గొనగా 9మంది ఒక్క వాహనాన్ని కూడా దక్కించుకోలేదు వేలం నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.25000 మేరకు ఆదాయం వచ్చినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

# పామిడిలో 25న విఠల కోటి నికిత పత్రస్తూప ఆవిష్కరణ





**పామిడి,జూన్16.అక్షర టైమ్స్:** స్థానిక పామిడి పట్టణంలోని భావసారా క్షత్రియ సమాజ్ డబ్బీదార్ ఫిర్కా రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయంలో ఈనెల 25వతేది గురువారం విట్టల కోటి లిఖితపత్రస్థూప ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ,భావసారా క్షత్రియ భజన మండలి అధ్యక్షులు కార్యవర్గం పక్షాన కమిత్కర్ వేణుగోపాల్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు పండరిపుర శ్రీక్షేత్ర భోధలేబాబా గురుపరంపర సద్గురు ప్రభాకర్ భోదకె మహారాజ్,యశ్వంత్ మహారాజ్ లు,ఆవిష్కరిస్తారని వారు తెలిపారు.అదే రోజు స్మార్థజ్ఞానేశ్వరి పారాయణం,24బుధవారం గురు ఉపదేశాలు,21వతేది ఆదివారం నుండీ 3రోజుల పాటు సాయంత్రం 6గంటల నుండీ నామ జపం, ప్రవచనలు కొనసాగుతాయాన్నారు.

# సబ్సిడీ వేరుశనగ విత్తరాల పంపిణీ



**పామిడి,జూన్16. అక్షర టైమ్స్:** పామిడి మండలంలోని వంకరాజుకాలవ గ్రామంలో రైతులకు విత్తన వేరుశనగ కాయల బస్తాలను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు ఈశ్వర్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రకూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరుతూ 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తూ ఉన్నదని, కూటమి ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుందని, రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ ఉన్నదని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయరాం, గుమ్మనూరు ఈశ్వర్, ఎంపీడీవో తేజోష్ణ, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, మండల కూటమినాయకులు, పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు, వీఆర్ఏ,సచివాలయసిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వంకరాజుకాలువకు నిర్మించిన తారు రోడ్డు ప్రారంభం





**పామిడి,జూన్16.అక్షర టైమ్స్:** పామిడి మండలంలోని పెన్నప్ప గుడి నుంచి వంకరాజుకాలవ గ్రామం వరకు కోటి 90 లక్షలతో నూతనముగా నిర్మించిన తారు(బిటి) రోడ్డును గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, మరియు ఆయన తనయుడు పామిడి గుత్తి మండలాల పార్టీఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉన్నామని,సమస్యలను పరిష్కరించుటకు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నామని వారు పేర్కొన్నారు. గ్రామీణప్రాంతాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి,సమస్యలను తీర్చుటకు నిరంతరం ప్రజలకు అధికారులకు నాయకులకు కార్యకర్తలకు నేను, నా కుమారుడు ఈశ్వర్ నిరంతరం అందుబాటులో ఉండి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజోష్ణ, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్,ఎమ్మెల్యే జయరాం, గుమ్మనూర్ ఈశ్వర్, బొల్లు శ్రీనివాసులరెడ్డి, జింకల సంజీవ, గౌస్ ఫిరా,పెరమసాని రామాంజనేయులు, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు నాయక్, ధనుంజయ,సుదర్శన్, లక్ష్మీనారాయణ, వీరప్ప, అబ్దుల్ ఖాదర్, రామయ్య, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేరుశనగ విక్రయం దాకా రైతుకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు





**రాయదుర్గం,జూన్16.అక్షర టైమ్స్:** రైతు లాభదాయకమైన వ్యవసాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు వ్యవసాయంలో రైతుల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. గుమ్మగట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామంలో మంగళవారం జరిగిన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే కాలవ మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో రైతులకు సహాయం పెరిగిందన్నారు. రైతులకు అనేక రూపాల్లో రాయితీలు, ఆర్థిక సహాయం సాంకేతిక సహకారం అందజేయడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుకు ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే కాకుండా, పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనప్పుడు కనీస మద్దతు ధరపై ప్రభుత్వమే కొనుగోళ్లు చేయిస్తోందన్నారు. తద్వారా మార్కెట్లో పోటీ పెరిగి పంట దిగుబడులకు బహిరంగ మార్కెట్లో ధర పెరుగుతోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 42వేల మంది రైతులకు రూ.91.76కోట్ల ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. డ్రిప్ పరికరాలపై రూ.40కోట్ల సబ్సిడీ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మరో రూ.30 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ మెరుగుపరచడానికి ఇంకో రూ.85 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగానికి ఇంత భారీ ఎత్తున నిధులు అందుతున్నాయంటే..! చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండడమే కారణమన్నారు. దశాబ్దాలుగా వేరుశనగ పంట ఒక్కటే సాగు చేయడం వల్ల భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం పడుతోందని ఎమ్మెల్యే సూచించారు. రైతులు వేరుశనగకు ప్రత్యామ్నాయంగా కంది, జొన్న, మొక్కజొన్న, ఉలవ, కొర్ర వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఇప్పటికే రైతుల్లో అవగాహన పెరిగి ఈ దిశగా ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. గుమ్మగట్ట మండలంలో కొందరు రైతులు కొత్తమీర సాగు వైపు మొగ్గు చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారన్నారు. వారి పంట ఉత్పత్తులను బెంగళూరు, శివమొగ్గ ప్రాంత మార్కెట్ కు తరలించి అధిక ఆదాయం పొందుతుండడం శుభ పరిణామమన్నారు. ఇదే నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు శ్రద్ధ పెట్టే రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, మార్కెటింగ్ సదుపాయాలపై వ్యవసాయ శాఖ దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. రైతులు, అధికారులు, వ్యాపారులు సమిష్టిగా పనిచేస్తే... రైతుకు న్యాయమైన ధర లభిస్తుందన్నారు. అప్పుడు వ్యవసాయం తప్పక లాభసాటిగా మారుతుందని ఎమ్మెల్యే కాలవ ఆశాభావం వ్యక్తపరిచారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని కూటమి ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తూ ఉందన్నారు. రైతు శ్రేయస్సు కోసం ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తోందన్నారు. రైతు ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి రైతులు చేదోడు వాదోడుగా ఉంటూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాలవ కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాలవ సన్నన్న, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ధానవేంద్ర, కెపి దొడ్డి నాగరాజు, మాజీ కన్వీనర్ కురుబ గిరిమల్లప్ప,గొనభావి రమేష్, సదాశివ, కిందింటి హరినాథ్,గంగాధర్,కాలువ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ల ఎన్నికల్లో దిమ్మ తిరిగే సమాధానం ఇస్తాం



**రాయదుర్గం,జూన్16.అక్షర టైమ్స్:** సంపద సృష్టిస్తామని చెప్పి అమలు గాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో, ఆ సంపద మొత్తం కూటమి నాయకులే సృష్టించుకుంటున్నారన్న విషయం తేటతెల్లమవుతోంది, మద్యపాన ప్రియుల దగ్గర అధిక డబ్బు వసూలు చేయడం అఫీషియల్ అయిపోయింది, ఓటుకు నోట్లు ఇచ్చి ఎలాగైనా గెలుస్తామనే ధీమాతో ఉన్న కూటమి నాయకులకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలని రాయదుర్గం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా గౌని ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా పిలుపు ఇచ్చారు.భవన నిర్మాణ కార్మికులు కానీ, దినసరి వేతనానికి పనిచేసే కూలీలు కానీ / కార్మికుల కానీ, బడుగు బలహీన వర్గాల ప్రజలు కానీ, ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడితే వారికి వచ్చే కొంత సొమ్ములో తమ బాధల్ని కష్టాల్ని మరువాలని మద్యం దుకాణానికి వెళ్లి వారు తీసుకునే ప్రతి ఒక్క బాటిల్ పైన 10 నుంచి 15 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్న అక్రమ మరియు సక్రమ మద్యం దుకాణాల పైన వెనువెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పి నేను డిమాండ్ చేస్తే నాపై లేనిపోని బాండాలు వేస్తూ మౌఖిక దాడి చేస్తూ నన్నే బెదిరించే దూరంలో మాట్లాడించారు .ఎందుకు అధిక ధరలకు అమ్ముతున్న మధ్యాన్ని కంట్రోల్ చేయట్లేదుఎందుకు అధికారులు మద్యం బాబుల మద్యపాన ప్రియుల జేబులు కొల్లగొడుతుంటే మరియు ఒక్కో బాటిల్ పైన పది రూపాయలు అంటే కనీసం ప్రతినెల ఒక్కొక్క మద్యపాన ప్రియుడు 20 బాటిల్ కొంటున్నాడంటే నెలకు రెండు వందల రూపాయలు దోపిడీ జరుగుతోంది, మరి గత 20 నెలల్లో ఒక్కొక్క మద్యపాన ప్రియుని వద్ద మీరు అక్రమంగా వసూలు చేసిన మొత్తం నాలుగు వేల నుంచి ఎనిమిది వేల రూపాయల పై మాటే. మద్యం అక్రమ ధరలకు అమ్ముతున్నారన్న విషయం ఆధారాలతో సహా ఎక్సైజ్ శాఖకు సమర్పించాం.మీడియా ద్వారా సోషల్ మీడియా ద్వారా కూడా మేము తెలిపిన ఇప్పటిదాకా చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కేస్తున్న ఎక్సైజ్ అధికారుల పైన, అందుకు కొమ్ము కాస్తున్న కూటమినేతల పైన కూడ రాష్ట్ర ఎక్సైజ్ మంత్రికి గానీ ముఖ్యమంత్రి కి గాని మేము ఫిర్యాదు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నామన్నారు.

# మహిళలను కించపరచడం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనం : ఎంపీపీ దాసరి సునీత



**బుక్కరాయసముద్రం,జూన్16.అక్షర టైమ్స్:** రాజకీయాల్లో విభేదాలు సహజం. ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతి ప్రతిపక్షానికి ఉంది. అయితే విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని, రూపాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం ఏమాత్రం సమర్థనీయం కాదు. రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వంగలపూడి అనిత పనితీరుపై మాట్లాడకుండా, ఆమె వ్యక్తిగత రూపాన్ని మరియు మేకప్‌ను లక్ష్యంగా చేసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరం, మహిళా సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలు కేవలం హోంమంత్రి అనిత నే కాదు, ఆత్మవిశ్వాసంతో, హుందాగా జీవించే ప్రతి మహిళను కించపరచడమే. మహిళలు ఎలా దుస్తులు ధరించాలి, ఎలా కనిపించాలి అనేది వారి వ్యక్తిగత స్వేచ్ఛ. దానిని రాజకీయ విమర్శలకు ఆయుధంగా మార్చడం మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే. మహిళా గౌరవం గురించి గొప్పలు చెప్పుకునే వైసీపీ నాయకత్వం, తమ పార్టీ నేతల ఇలాంటి వ్యాఖ్యలను ఖండిస్తుందా? లేక మౌనంగా సమర్థిస్తుందా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. హోంమంత్రి విధానాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో విమర్శించాలి. కానీ రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత రూపాన్ని లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ సంస్కృతికి నిదర్శనం. "దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, హుందాగా, అందంగా కనిపిస్తే వైసీపీ నేతలకు ఎందుకు అసహనం? ఇదేనా మీరు చెప్పే సామాజిక న్యాయం?" అని ఎంపీపీ దాసరి సునీత ప్రశ్నించారు. వైసీపీకి మహిళలను అవమానించే చరిత్ర కొత్తది కాదన్నారు. గతంలో మహిళా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు, అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు జరిగిన సందర్భాల్లో కూడా వైసీపీ నాయకత్వం స్పందించలేదని గుర్తు చేశారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీ పడదని స్పష్టం చేశారు. మహిళలపై వేధింపులు, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం ముందు సమానమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన సందేశం ఇచ్చారని తెలిపారు. మహిళలపై ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో సొంత పార్టీ నేతలపై కూడా చర్యలు తీసుకున్నామని, సోషల్ మీడియాలో మహిళలను అవమానించే వారిపై కఠిన చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం "శక్తి యాప్", ప్రత్యేక సైబర్ నిఘా, మహిళా పోలీస్ విభాగాల బలోపేతం వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళలను గౌరవించని రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌లో స్థానం లేదన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత గపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గుడివాడ అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించే భాషను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సహించరని ఎంపీపీ దాసరి సునీత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ రాజేశ్వరి చాముండమ్మ జన చైతన్య కాలనీ మహిళలు పాల్గొన్నారు

# తాసిల్దార్ ఆఫీస్ లో ఓటర్ జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం



**ఆమడగూరు,జూన్15.అక్షర టైమ్స్:** మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో మండల తాసిల్దార్ మారుతి ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ ఆధ్వర్యంలో మండల బిఎల్ఓ లకు ఓటర్ జాబితా సవరణపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మారుతీ ప్రకాష్ మాట్లాడుతూ 2002 ఓటర్ జాబితా ప్రకారం 30 40 నుంచి సంవత్సరాలలోపు నమోదైన ఓటర్ జాబితా ప్రకారం మహిళలకు గాని పురుషులు గాని వారి జాబితా ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ నమోదు అడ్రస్ ప్రకారం మహిళ అయితే ఎక్కడ నుంచి వివాహం జరిగినదో అక్కడ ఓటర్ జాబితా ఐడీ ప్రకారం వారి తల్లిదండ్రులు ఓటర్ ఐడి ప్రకారం 2002లో నమోదైన పేరును అప్లికేషన్లు దరఖాస్తు చేసుకుని ఉన్న లిస్టు ప్రకారం 2026 సంవత్సరాలకి ఓటు నమోదు చేసుకోవాలని బి ఎల్ఓ లు మీ ఇంటి దగ్గరికి వస్తారని అప్లికేషన్ ఇచ్చి ఓటర్ జాబితాను ప్రారంభిస్తారు వారికి సహకరించి ఎటువంటి అవకతవకలు లేకుండా ఓటు నమోదు చేసుకొని రెండు పాస్ ఫోటోలు అప్లికేషన్ ఫారం లో పేరు నమోదు చేసి ఇవ్వాలని తాసిల్దార్ మారుతీ ప్రకాష్ ఎంపీడీవో శకుంతలమ్మ సూపర్వైజర్లు 26 మంది బిఎల్వోలు కంప్యూటర్ ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రథమ దర్శనం ఏర్పాట్లపై డీఎస్పీ,శ్రీనివాసులు పరిశీలన..!



**గూగూడు,జూన్ 16:** శ్రీ గూగూడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రేపు 17న నిర్వహించనున్న ప్రథమ దర్శనం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను అనంతపురం రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. గూగూడు గ్రామాన్ని సందర్శించిన ఆయన, ఆలయ పరిసర ప్రాంతాలు, భక్తుల రాకపోకలు,భద్రతా చర్యలు,ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నార్పల ఎస్సై జి.సాగర్‌తో కలిసి ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు,శాంతిభద్రతల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఆలయ పరిసరాల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని డీఎస్పీ,శ్రీనివాసులు ఆదేశించారు. రేపటి ప్రథమ దర్శనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## చెబితే చేస్తాం'.. రెండేళ్ల పాలనపై కూటమి ధీమా

- ప్రజల నమ్మకమే ప్రభుత్వానికి బలం: మంత్రులు పుట్టపర్తిలో రెండు'ఏళ్ల నమ్మకం' సభ





**పుట్టపర్తి,జూన్16.అక్షర టైమ్స్:** ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, ప్రజలకు అండగా నిలవడం, అభివృద్ధి-సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పుట్టపర్తి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 2'ఏళ్ల నమ్మకం' కార్యక్రమంలో వారు మాట్లాడారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజా సమస్యలు తలెత్తిన ప్రతిసారి ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపుతోందని తెలిపారు.బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి పాలన అంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే పాలన అని పేర్కొన్నారు. సమస్య వస్తే పరిష్కారం, ఆపద వస్తే ఆదరణ, భవిష్యత్తుకు భరోసా అనే ఆరు సూత్రాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో భాగంగా జిల్లాకు ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని తెలిపారు. 450 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 100 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

## హిందూ స్మశాన వాటిక స్థల పరిశీలన



**ముదిగుబ్బ,జూన్16.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా, ముదిగుబ్బలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటు కోసం సిపిఎం పార్టీ గత కొంతకాలంగా పలు దఫాలుగా ధర్నాలు, ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తూ వస్తోంది. ప్రజల సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు నిరంతరం కృషి చేశారు. ఈ నేపథ్యంలో ముదిగుబ్బ తహసిల్దార్ మహేశ్వర్ రెడ్డి స్పందించి, సోమవారం ముదిగుబ్బ బైపాస్ సమీపంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులు స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న భూమి వివరాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మహేశ్వర్ రెడ్డి, సర్వేయర్లు, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, కో-కన్వీనర్ టైలర్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. హిందూ స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, స్థల కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కోరారు. స్థానిక ప్రజలు కూడా ఈ చర్యను స్వాగతిస్తూ సమస్య త్వరలో పరిష్కారం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## గుత్తిలో గంజాయి స్వాధీనం -- ఇద్దరు నిందితుల అరెస్టు



**గుత్తి,జూన్16.అక్షర టైమ్స్:** గుత్తి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీలలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి గంజాయి, నల్లని పేపర్ కట్టలు మరియు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన చిలకం గోపాల్ (63), దిమ్మగుడి గ్రామానికి చెందిన అప్పయ్యగారి బద్రి (42) అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు అందినసమాచారంతో గుత్తి పట్టణంలోని దర్గా శివ పెట్రోల్ బంక్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 20 గ్రాముల గంజాయి, డబ్బు నోట్ల మాదిరిగా కత్తిరించిన 147 నల్లని పేపర్ కట్టలు మరియు ఒక హీరో సూపర్ స్ప్లెండర్ మోటార్ సైకిల్ లభించాయి.ప్రాథమిక దర్యాప్తులో గుప్తా అనంతపురానికి చెందిన కె.ఎల్. రమేష్‌తో గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు మరియు వ్యక్తిగత విభేదాల నేపథ్యంలో అతనిని గంజాయి, నకిలీ నోట్ల కేసులో ఇరికించేందుకు నిందితులు ప్రయత్నించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహిత మరియు మాదక ద్రవ్యాలు, మానసిక ప్రభావ పదార్థాల నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన గుత్తి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్ఐ అమీర్ ఖాన్, పోలీసు సిబ్బంది మరియు సహకరించిన రెవెన్యూ అధికారులను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తెలుగు మహిళలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరు

- టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు



**గుంతకల్,జూన్16.అక్షర టైమ్స్:-ప్రతినిధి గుమ్మనూరు హరి:** గుంతకల్ పట్టణం ఈరోజు ముందుగా టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు మాట్లాడుతూ గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు గుంతకల్ టీడీపీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ఆదేశాల మేరకు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు ఆధ్వర్యంలో గుంతకల్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లు వేసి నిరసన తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కూటమి తెలుగు మహిళా నాయకులు మరియు కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, చేసిన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన గుడివాడ అమర్నాథ్ కు చెప్పులు దండ వేసి ర్యాలీ పెద్ద ఎత్తున చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంజలి (రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్), జయమ్మ (మాజీ కౌన్సిలర్), విద్యారాణి (మాజీ కౌన్సిలర్), మెరున్నిసా బేగం (మాజీ కౌన్సిలర్), జనసేన వీర మహిళ బండి చంద్రకళ , విజయలక్ష్మి ( మాజీ బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు), ఇందిరమ్మ (సంచార జాతుల నాయకురాలు), జీవిత (టీడీపీ జిల్లా కార్యదర్శి), బి.ఎల్. లక్ష్మి గారు రామస్వామి ఆలయ కమిటీ నెంబర్ , వీరమ్మ (జనసేన నాయకురాలు), సుజాత , స్రవంతి , సుంకమ్మ తదితర మహిళా నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ం

## బైపాస్ లెనిన్ క్లబ్ పక్కన హోటల్ లో చోరీ





**పామిడి/గార్లదిన్నె16.అక్షర టైమ్స్:** గార్లదిన్నె మండలంలోని కల్లూరు 44వ జాతీయ రోడ్డుకు సమీపంలో గల లెనిన్ క్లబ్ ప్రక్కన ఆనందరెడ్డి హోటల్లోకి దొంగలు ఐరన్ ఆంగ్లేరు కట్ చేసి చొరబడి చోరీ చేశారు. హోటల్ యజమాని ఆనందరెడ్డి వివరణ మేరకు హోటల్లోని నగదు 6000 రూపాయలు, 20,000 విలువచేసే ఆరు బాక్సులు కూల్ డ్రింకులు, సిగరెట్లు, సోమవారం రాత్రి దొంగలు చోరీ చేశారని వాపోయాడు. ఈ విషయాన్ని గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, అయినా పోలీస్ అధికారులు ఇంతవరకు స్పందించలేదని హోటల్ యజమాని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా పోలీసులు వేగవంతముగా దర్యాప్తు చేసి చోరీ చేసిన దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.